## కాలమ్ దాటని కథ

### "నిర్వాకం"

డ్రాయింగ్ రూంలో కూర్చుని ఆ వేళ పోస్ట్‌లో తన కొచ్చిన ఉత్తరాలు చూసుకుంటున్నాడు మూర్తి. వాటిలో గులాబి రంగు కవరు ఆకర్షించిందతనిని. వెంటనే ఓపెన్‌చేసి చూశాడు. అది టెలిఫోన్ డిపార్ట్‌మెంటువాళ్లు పంపిన టెలిఫోను బిల్లు.

అది చూస్తూనే మతిపోయినంత పనైంది మూర్తికి. మరోవేపు ముచ్చెమటలు పోసాయి. ఏమిటీ ఘోరం అనుకున్నాడు. అతని చేతిలో టెలిఫోను బిల్లు రెపరెపలాడుతోంది-గాలికి కాదు, చేతులు వణికి. బిల్లులోని అంకెల్ని మళ్లీ మళ్లీ చూశాడు. ఓ రెండు సున్నాలు ఎక్కువ పడ్డాయేమోనని కాస్త స్థిమితపడ్డాడు. మళ్లీ బిల్లు చూసి గొల్లుమన్నాడు. వెంటనే టేబుల్ మీది టెలిఫోన్ వంక చూశాడు. బుసలు కొడుతున్న నల్ల త్రాచులా కనిపించిందతనికి.

వెంటనే టెలిఫోను డిపార్ట్‌మెంటాఫీసుకు వెళ్లాడు కోపంగా. ఇదెక్కడి దారుణమన్నాడు. అంకెలు తప్పు పడలేదు. సున్నాలు ఎక్కువ పడలేదు. ఆలస్యం చెయ్యక కట్టెయ్యమన్నారు టెలిఫోన్ డిపార్ట్‌మెంటు వాళ్లు. ఒకటా?. రెండా?. అక్షరాలా ఏభై వేల రూపాయలు. టెలిఫోను బిల్లు కట్టాలి. ఆ మాట వినగానే స్పృహ తప్పినంతపనైంది అతనికి.

టెలిఫోను బిల్లు - ఏభైవేల రూపాయలు అతని కళ్ల ముందు కదులుతుండగా నీరసంగా ఇంటికి చేరుకున్నాడు. ఇదెక్కడి వింతని గట్టిగా అరిచాడు. ఇంట్లో వాళ్లని గుచ్చి గుచ్చి ప్రశ్నించాడు.

అప్పుడాయన కుమార్తె 'సుషమ' బెదురుతూ చెప్పింది. అమాయకంగా చెప్పింది. సిగ్గుపడుతూ చెప్పింది. తను కాబోయే భర్తకు ప్రతిరోజూ ఢిల్లీకి ఎస్.టి.డి. ఫోన్ కాల్ చేసేదాన్నని నసిగింది.

చాలా కాలంగా ఆమెకు కాబోయే భర్తతో ప్రతి రోజూ గంటలకు గంటలు-గమ్మత్తుగా-కులాసాగా ప్రేమ కబుర్లు హాయిగా చెప్పేది. తను వినేది.

సుషమ చెప్పిన మాట కన్నతండ్రి విన్నాడు. హార్ట్ ఎటాక్ వచ్చినంత పనైంది. ఆర్డినరీకాల్ కంటే ఎస్.టి.డి. కాల్‌కు ఎంతో ఎక్కువ డబ్బు అవుతుందని ఆ అమ్మాయికి తెలియదు పాపం. ఆమె పెళ్లి నిశ్చయం చేసిన వెంటనే అది కాస్తా జరిపించేసినా ఇంత డబ్బు ఖర్చవక పోనుగదాని బాధగా మూలిగింది ఆ తండ్రి హృదయం.

-అంగర శ్రీదేవి

---

# ఆంధ్రజ్యోతి
## సచిత్ర వారపత్రిక

# కార్టూన్ల పోటీ

*** 20 ఉత్తమ కార్టూన్లకు 20x75-1500 రూపాయలు**

*** రెండు ఉత్తమ కార్టూన్ బొమ్మల కథలకు 500x2-1000 రూపాయలు**

**(10 లేదా 12 పేజీలకు మించని కథ)**

*** స్ట్రిప్ కార్టూనులు 50x50-2500 రూపాయలు**

ప్రపంచ ప్రఖ్యాత కార్టూనిస్ట్ శ్రీ అబూ అబ్రహాం ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక నిర్వహిస్తున్న కార్టూన్ల పోటీకి ముఖ్య న్యాయ నిర్ణేతగా వ్యవహరించడానికి అంగీకరించారని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. కార్టూన్ల పోటీ గడువు తేదీ 15.11.85 వరకు పొడిగించడమైనది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కార్టూనిస్టులు యితోధికంగా మంచి బొమ్మలు వేసి పోటీలో 5000 రూపాయలు గెలుచుకోగలరని ఆశిస్తున్నాము.

**నిబంధనలు:**

* కార్టూన్లసైజు: 15x10 సెం.మీ.

* బొమ్మల కథకు కార్టూన్ల సైజు: 24 1/2x28 సెం.మీ.

* స్ట్రిప్ కార్టూనుల సైజు: 28x11 1/2 సెం.మీ.

* ఒక కార్టూనిస్టు ఎన్ని బొమ్మలయినా పంపవచ్చు. ఎన్ని పోటీలలోనయినా పాల్గొనవచ్చును.

* కాపీ కార్టూనులు, అనుసరణలు పంపరాదు.

* కార్టూనులు తమ సొంతమని, అనుసరణలు కావని హామీ పత్రం జతపరచాలి.

* బహుమతికి యోగ్యం కాని, అంగీకరింపని కార్టూనులు త్రిప్పి పంపగోరేవారు సొంత చిరునామాతో స్టాంపులు అతికించిన కవరు విధిగా జతచేయాలి.

* బహుమతి నిర్ణయం ఆంధ్రజ్యోతి సంపాదక వర్గానిదే తుది తీర్పు. ఉత్తర ప్రత్యుత్తరాలు జరపబడవు.

* బహుమతి పొందిన కార్టూన్లుగాక, వచ్చిన వాటిలో మంచివి వుంటే ఆయా కార్టూన్లను ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో వీలువెంబడి ప్రచురించగలము.

* కార్టూనిస్టులు తమ కార్టూన్లను

కార్టూన్ల పోటీ
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక
పోస్టుబాక్సు - 712
విజయవాడ - 520 010

చిరునామాకు పంపాలి.

గడువుతేదీ పొడిగింపు: 15-11-1985

—ఎడిటర్